

రైతు భరోసా సర్వే ప్రారంభం



- ఈనెల 26 నుంచి రైతుల ఖాతాల్లో డబ్బు జమ
- 20 తేదీ వరకు వ్యవసాయ భూముల గుర్తింపు
- 'జాబ్‌కార్డు'ల ఆధారంగా భూమిలేనివారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రైతు భరోసా పథకం కింద రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేస్తోంది. ఈనెల 26 నుంచి రైతుల ఖాతాల్లో డబ్బు జమచేయాలని నిర్ణయించిన ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలను జారీ చేసింది. గురువారం నుంచి 20వ తేదీ వరకు వ్యవసాయ భూములను గుర్తించేందుకు రెవెన్యూ, వ్యవసాయాధికారులతో కూడిన బృందాలు సర్వే నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ సర్వేలో సాగుకు యోగ్యంగా లేని భూములు, గృహాలు నిర్మించుకున్న భూములు, లేఅవుట్లుగా మారిన భూములు, కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తున్న భూములు, నాలా కన్వర్షన్ అయిన భూములు, ప్రభుత్వం సేకరించిన భూములను గుర్తిస్తారు. వాటిని రైతు భరోసా సాయాన్ని పొందే జాబితా నుంచి తొలగిస్తారు. సర్వే అనంతరం గ్రామాల్లో ఈ భూముల వివరాలను ప్రజల సమక్షంలో ప్రకటిస్తారు.

76 సర్వే బృందాల ఏర్పాటు

జిల్లాలో 207 రెవెన్యూ గ్రామాలు ఉండగా వ్యవసాయయోగ్యమైన భూములను గుర్తేంచుందుకు 76 బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో టీంలో వ్యవసాయ విస్తరణ అధికారితోపాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లేదా రెవెన్యూశాఖకు చెందిన సీనియర్, జూనియర్ అసిస్టెంట్ సభ్యులుగా ఉంటారు. 20లోగా వీరు సర్వేను పూర్తి చేస్తారు. తొలి రోజైన గురువారం 58 గ్రామాల్లో సర్వే పూర్తయింది.

గతంలో 3.55 లక్షల ఎకరాలకు పెట్టుబడి సాయం

జిల్లాలో 3.55 లక్షల ఎకరాల నుంచి 3.65 లక్షల ఎకరాల వరకు సాగు భూమి ఉన్నది. గత ప్రభుత్వ హయాంలో ప్రతి సీజన్‌లో 3.55 లక్షల ఎకరాలకు తగ్గకుండా పెట్టుబడి సాయం అందింది. 2023 వానకాలం సీజన్‌లో 2,00,075 మంది రైతులు ఎకరాకు ఐదు వేల రూపాయల చొప్పున 182.3 కోట్ల రూపాయల పెట్టుబడి సాయం పొందేందుకు అర్హులని గుర్తించారు. ఆ సీజన్‌లో 1,88,515 మంది రైతులకు 177.99 కోట్ల రూపాయలు సాయంగా అందింది. 2023 యాసంగిలో 2,03,096 మంది రైతులకు 182.01 కోట్ల రూపాయల పెట్టుబడి సాయం ఇవ్వాలని భావించారు.

1,90,826 మంది రైతులకు 177.61 కోట్ల రూపాయల పెట్టుబడి సాయం అందింది. గడిచిన సీజన్లలో రైతులకు అందిన డబ్బును పరిగణలోకి తీసుకుంటే 3.55 లక్షల ఎకరాల భూమికి ప్రభుత్వ సాయం అందిస్తూ వచ్చారు. ప్రస్తుతం సాగుకు యోగ్యమైన భూమికి మాత్రమే పెట్టుబడి సాయాన్ని అందించాలని నిర్ణయించారు. దీంతో కనీసం 30 నుంచి 40వేల ఎకరాల భూమి రైతు భరోసా సాయం పొందడానికి అర్హతలేనివిగా మారే అవకాశముందని భావిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 3.25 లక్షల ఎకరాలకు రైతుభరోసా సాయం అందనున్నదని, ఎకరాకు ఒక్కో సీజన్‌కు 6వేల రూపాయల చొప్పున సుమారు 195 కోట్ల రూపాయలు రైతులకు పెట్టుబడి సాయంగా అందే అవకాశాలు ఉన్నాయి.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందేది ఎందరికో..?

భూమిలేని వ్యవసాయ కూలీల కుటుంబాలకు ప్రతి యేటా 12వేల రూపాయల ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం ఈనెల 26 నుంచే అమల్లోకి రానున్నది. ఉపాధి హామీ జాబ్‌కార్డుల ఆధారంగా వ్యవసాయ కూలీ కుటుంబాలను గుర్తించ నున్నారు. జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 1,23,625 జాబ్‌కార్డులు జారీ చేశారు. ఈ కార్డుల్లో 2,31,802 మంది కూలీలు ఉపాధి కోసం నమోదు చేసుకున్నారు.

జిల్లాలో 82,460 జాబ్ కార్డులు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నాయి. 1,26,338 మంది కూలీలు ఈకార్డుల ద్వారా పనులు చేసి ఉపాధి పొందుతున్నారు. ఏడాదిలో కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనులకు హాజరై ఉన్న వారిని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం లబ్ధి దారులుగా ఎంపిక చేస్తారు. జిల్లాలో 20 రోజుల పాటు ఉపాధి హామీ పనులు చేసిన కుటుంబాలు 43,650 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ జాబ్‌కార్డుల కుటుంబాలకు వ్యవసాయ భూమి ఉందా.. లేదా.. అన్నది పరిశీలించి, అందులో భూమి లేని వారిని అర్హులుగా గుర్తించనున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం

ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలనలో జిల్లా వ్యాప్తంగా 2,10,677దరఖాస్తులు వచ్చాయి. 622 మంది సిబ్బంది ఈ దరఖాస్తులను పరిశీలించారు. ఇప్పటికే అన్ని దరఖాస్తుల పరిశీలన పూర్తయింది. తొలి విడతలో సొంత స్థలాలు ఉన్నవారిని ఎంపిక చేసి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మిగతా 8వ పేజీలో..

వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించాలి

కలెక్టర్ పమేలా సత్పతి

మానకొండూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యోగ్యం కాని భూములను త్వరగా గుర్తించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మండలంలో మానకొండూర్, చెంజర్ల, కెల్లేడులో రైతు భరోసా సర్వేను అధికారులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్వేను కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఐదు రోజులపాటు సర్వే కొనసాగుతుందన్నారు. ఈ సర్వేలో రైతులు సాగు చేస్తున్న భూములను పరిగణన లోకి తీసుకోవాలని అధికారులకు సూచించారు. వ్యవసాయానికి యోగ్యం కాని భూములను రైతు భరోసా జాబితా నుంచి తొలగించాలని ఆదేశించారు. అధికారులు బృందాలుగా ఏర్పడి సర్వేను పూర్తి చేయాలన్నారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ పరిస్థితులను పరిశీలించి అర్హులకు మాత్రమే రేషన్ కార్డు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో వరలక్ష్మి, ఏవో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గ్రామాలు, వార్డులలో ఏర్పాటు చేస్తున్న ఆరోగ్య మహిళా క్యాంపులను సద్వినియోగం చేసుకొని ఉచిత వైద్య పరీక్షలు చేసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని సదాశివపల్లి కూడలిలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా క్యాంపును ఆమె సందర్శించారు.


మానకొండూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

పోస్టల్ వ్యవస్థలో కీలకం..పిన్‌కోడ్
ఈ నెల 21 వరకు పిన్‌కోడ్ వీక్ 6

క్రీడలతో మానసికోల్లాసం
ట్రైయినీ ఐపీఎస్ వసుంధరా యాదవ్ 7

'శాతవాహన' లో అంతర్గత బదిలీలు 7

ప్రభుత్వ వైద్యకళాశాలలో పోస్టుల భర్తీకి వాక్‌ఇన్ ఇంటర్వ్యూ

భగత్‌నగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో పోస్టుల భర్తీకి ఈనెల 20న వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ వైద్య విద్యా సంచాలకులు తాత్కాలిక పద్ధతిన ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అనుమతించారన్నారు. అనాటమీ విభాగంలో ప్రొఫెసర్-1, అసోసియేట్ ప్రొఫెసర్-1, అసిస్టెంట్ ప్రొఫెసర్-1, ఫీజియాలజీ ప్రొఫెసర్-1 బయోకెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్-1, ఫార్మకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్-1, రెస్పిరేటరి మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్-1, మైక్రో బయోలజీ అసోసియేట్ ప్రొఫెసర్-1, కమ్యునిటీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్-1, సైకియాట్రి అసోసియేట్ ప్రొఫెసర్-1, ఎమర్జెన్సీ మెడిసిన్ ప్రొఫెసర్-1, ఒబెస్ట్రిటిక్స్ అండ్ గైనకాలజీ ప్రొఫెసర్-1, రేడియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్-1, అనస్థియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్-1 పోస్టు ఖాళీగా ఉందన్నారు. మొత్తం 15 పోస్టులకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు కళాశాల వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారం డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. 20న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఒరిజినల్ సర్టిఫికెట్స్, రెండు సెట్స్ జిరాక్స్ ఖాపీలతో వాక్ ఇన్ ఇంటర్వ్యూకు కొత్తపల్లిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో హాజరు కావాలన్నారు. నోటిఫికేషన్‌కు సంబంధించి పూర్తి వివరాలు ఈనెల 17వ తేదీ నుంచి కళాశాల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి

మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్


అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం 20వ డివిజన్ పరిధిలోని ఆరెపల్లిలో కమిషనర్ పర్యటించి అభివృద్ధి పనులను, ప్రజా సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో ఇప్పటికే ప్రతిపాదనలను సిద్ధం చేసిన పనులకు అంచనాలు తయారు చేసి టెండర్లు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పారిశుధ్య పనులు మరింత మెరుగుపరచాలని, ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రం చేయడంతోపాటు కాలువలకు ఇరువైపులా ఉన్న కలుపు మొక్కలను తొలగించాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, డివిజన్ శుభ్రంగా ఉండే విధంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు పర్యవేక్షణ చేస్తూ పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో డీఈలు వెంకటేశ్వర్లు, ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా కర్ర సత్య ప్రసన్నరెడ్డి కొనసాగింపు


సత్యప్రసన్నరెడ్డికి నియామక పత్రాన్ని అందజేస్తున్న మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతరావు

కరీంనగర్ అర్బన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా కర్ర సత్య ప్రసన్నరెడ్డిని కొనసాగిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతరావు ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో మొగిలి సునీతారావు సత్యప్రసన్నరెడ్డికి నియామకపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్య ప్రసన్నరెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ మార్కెట్ రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 3 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశమందిరంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అత్యంత వైభవంగా నిర్వహించే బ్రహోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, షామియానాలు, క్యూలైన్లు, బారికేడ్‌లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

మున్సిపల్, రెవెన్యూ, దేవాదాయ, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు. ఫైరింజన్‌ను అందుబాటులో ఉంచాలని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వో వెంకట రమణకు సూచించారు. ప్రభుత్వం ఆరోగ్య మహిళ కార్యక్రమం కింద చేసే ఉచిత వైద్య పరీక్షల గురించి భక్తులకు తెలిసేలా పోస్టర్లు ఏర్పాటు చేయాలన్నారు.

ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సమయంలో స్వామివారి సేవకు భక్తులు ముందుకు వస్తున్నారని తెలిపారు. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్‌దేశాయ్, లక్ష్మీకిరణ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఇన్‌చార్జి డీఆర్వో పవన్‌కుమార్, ఆర్డీవో కుందారపు మహేశ్వర్ పాల్గొన్నారు.


పాల్గొన్న అధికారులు, సిబ్బంది

బీఆర్‌ఎస్ నుంచి గెలిచి పార్టీని విమర్శిస్తే ఊరుకోవాలా

- ప్రశ్నిస్తే కేసులు పెట్టారు
- రౌడీ షీటర్‌కంటే హీనంగా అరెస్టు చేశారు
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే పార్టీని విమర్శిస్తే ఊరుకోక ప్రశ్నిస్తే తనపై కేసులు పెట్టారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశంలో ఆరుగ్యారెంటీల అమలుతోపాటు హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజా సమస్యలపై ప్రశ్నించిన సమయంలో బీఆర్‌ఎస్‌ను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ విమర్శించడంతో తాను స్పందించాల్సి వచ్చిందని అన్నారు.

తనకు అసలు ఆర్డీవో ఎవరో కూడా తెలియదని, ఆయన ఆ సమావేశంలో ఎక్కడు న్నాడో లేదో తెలియదని, ఆయన ఫిర్యాదు చేస్తే కేసు ఎలా పెడతారని ప్రశ్నించారు. దీనిపై జిల్లా ఇన్‌చార్జి సీపీతో ఫోన్‌లో మాట్లాడి కేసు నమోదు చేసి అరెస్టు చేస్తే చెప్పాలని అంటే ఆయన కేసు లేదని చెప్పారని అన్నారు. ఆ తర్వాత తాను హైదరాబాద్‌లో ఓ మీడియా ఇంటర్వ్యూకు హాజరై వస్తుండగా 50 మంది పోలీసులు తనను ఒక రౌడీషీటర్ కంటే హీనంగా అరెస్టు చేసి తీసుకు వచ్చారన్నారు. తెల్లవారితే సంక్రాంతి పండుగ ఉండగా రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులను హౌస్ అరెస్టు చేసి పండుగ జరుపుకోకుండా చేశారని, ఇదే ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. దీన్ని ప్రజలు గుర్తిస్తున్నారని, ఏదో ఒక రోజు కర్రుకాల్చి ఈ ప్రభుత్వానికి వాతలు పెడతారని హెచ్చరించారు. ఆరు గ్యారెంటీలను ప్రశిస్తున్నందుకే కేసులు పెడుతు న్నారని, కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు.

ఆరుగ్యారెంటీలు అమలు చేసే వరకు వెంటబడి నిలదీస్తామని కౌశిక్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీల అమలుపై ప్రశ్నిస్తున్నందుకే మాజీ మంత్రి కేటీఆర్‌పై కేసు పెట్టారని, ఆయన చేసిన తప్పేమిటని, ఎందుకు కేసు పెడతారని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి తుగ్లక్ పాలన చేస్తున్నారని, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీష్‌రావులను అరెస్టు చేస్తే బీఆర్‌ఎస్ ఉండదనే భ్రమలో రేవంత్‌రెడ్డి ఉన్నారని, కేసీఆర్ ముందే గుర్తించి 60 లక్షల మంది కేసీఆర్‌లను తయారు చేశారన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

'విద్యుత్ అక్రమంగా వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి'


ఎస్‌ఈకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

గణేశ్‌నగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కోతిరాంపూర్‌లోని ఇండస్ట్రీలు, ఇళ్లకు విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఎస్‌ఈ రమేశ్‌బాబుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వ్యక్తులకు సహకరించిన విద్యుత్ అధికారులను సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొంపల్లి సాగర్, నగర కార్యదర్శి గాజుల కనకరాజు, మొగిలి సతీష్ పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలను విడుదల చేయాలి

సుభాష్‌నగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని రాష్ట్ర ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రామకృష్ణను టీఎన్జీవోస్ నాయకులు కోరారు. రాష్ట్ర ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రామకృష్ణను వారు హైదరాబాద్‌లో గురువారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ బిల్లుల బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉద్యోగులకు రావలసిన డీఏలు, పీఆర్సీ, ఉద్యోగులకు హెల్త్ కార్డులకు సంబంధించిన విషయాలను చర్చించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, రాష్ట్ర సహ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, హైదరాబాద్ సిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, మన్‌ప్రీత్‌సింగ్, మహేశ్ పాల్గొన్నారు.


స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రామకృష్ణను కలిసిన టీఎన్జీవోస్ నాయకులు

కోర్టుకు హాజరైన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మంగళవారం కోర్టు మంజూరు చేసిన బెయిల్‌కు సంబంధించి గురువారం కరీంనగర్ కోర్టుకు హాజరై పూచికత్తులను సమర్పించారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ఈనెల 12న జరిగిన ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజీవ్ కుమార్‌తో గొడవకు సంబంధించి కౌశిక్‌రెడ్డిపై కరీంనగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రెండు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. రెండు కేసుల్లో అతడిని సోమవారం రాత్రి అరెస్టు చూపిన పోలీసులు మంగళవారం ఉదయం మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా షరతులతో కూడిన బెయిలు మంజూరు చేశారు. కోర్టు ఆదేశాల ప్రకారం కౌశిక్‌రెడ్డి నలుగురు వ్యక్తులను పూచీకత్తులుగా కోర్టుకు సమర్పించగా కోర్టు స్వీకరించింది.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 9 మందికి జరిమానా

శంకరపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలో 9మందికి డ్రంకెన్ డ్రైవ్ కేసులో జరిమానా విధించినట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు. ఇటీవల డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన తొమ్మిది మందిని హుజూరాబాద్ కోర్టులో గురువారం హాజరుపరిచారు. ఈ సందర్భంగా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఈశ్వరయ్య తొమ్మిది మందికి రూ.11వేల జరిమానా విధించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు. మైనర్‌లకు వాహనాలు ఇవ్వద్దని సూచించారు. నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

పోస్టల్ వ్యవస్థలో కీలకం
పిన్‌కోడ్



- బట్వాడాను సులభతరం చేసేందుకు రూపకల్పన
- ఈ నెల 21 వరకు పిన్‌కోడ్ వీక్

పోస్టల్ వ్యవస్థలో కీలకమైనది పిన్‌కోడ్.. ఏదైనా ఉత్తరం కాని, పార్సల్ కాని సంబంధిత చిరునామాకు వెళ్లాలంటే ఆ ప్రాంతం పిన్‌కోడ్ ఉండాల్సిందే.. ప్రస్తుతం ఈ కామర్స్‌లోనూ పిన్‌కోడ్ కీలక పాత్ర వహిస్తోంది. ఆయా సంస్థలు పిన్‌కోడ్ ఎంటర్ చేసిన తర్వాతనే ఆ ప్రాంతంలో వస్తువుల డెలివరీ సౌకర్యం ఉందా.. లేదా అనే విషయం తెలుపుతాయి. భారతీయ తపాల శాఖ ప్రతి సంవత్సరం జనవరి 15 నుంచి 21 వరకు పిన్‌కోడ్ వీక్‌ను నిర్వహిస్తోంది.. ఈ నేపథ్యంలో పిన్‌కోడ్ గురించి కొన్ని విషయాలు తెలుసుకుందాం..

భగత్‌నగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): భారతీయ తపాలా శాఖ బట్వాడా సులభతరం చేసేందుకు పిన్‌కోడ్ వ్యవస్థను ప్రవేశపెట్టింది. భారతీయ తపాలా శాఖ ఉపయోగించే పోస్టల్ కోడ్ సిస్టమ్‌లో పిన్‌కోడ్ ఆరు అంకెలను సూచిస్తున్నది. 1972 ఆగస్టు 15వ తేదీన భారతీయ తపాలా శాఖ అదనపు కార్యదర్శి శ్రీరామ్ భికాజీ వేలంకర్ పిన్‌కోడ్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. తప్పుడు చిరునామాలు, సారూప్య స్థలాల పేర్లు, దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ప్రజలు ఉపయోగించే భాషలపై ఉన్న గందరగోళాన్ని తొలగించేందుకు పిన్‌కోడ్‌ను రూపొందించారు. దీంతో మాన్యువల్ సార్టింగ్, డెలివరీ సులభతరమైంది.

పిన్ నిర్మాణం

భారతీయ తపాలా వ్యవస్థలో పోస్టల్ జోన్, సబ్‌జోన్, సార్టింగ్ జిల్లా, పోస్ట్ ఆఫీస్‌లను సూచించే విధంగా పిన్‌కోడ్ నిర్మాణాన్ని చేశారు. మొదటి అంకె పోస్టల్ జోన్‌ను, రెండో అంకె సబ్‌జోన్‌ను, మూడవ అంకె సార్టింగ్ జిల్లాను, తర్వాత మూడెంకలు పోస్ట్ ఆఫీస్ చిరునామాను సూచించే విధంగా పిన్‌కోడ్‌లను రూపొందించారు.

డెలివరీ వ్యవస్థ

ప్రతి పిన్ డెలివరీ చేయాల్సిన పోస్ట్ ఆఫీస్‌కు మ్యాప్ చేసి ఉండడంతో డెలివరీ చేయడం సులభతరమైంది. పిన్‌కోడ్‌లో మొదట ప్రధాన తపాలా కార్యాలయం, తర్వాత సబ్ పోస్టాఫీస్, తర్వాత బ్రాంచి పోస్టాఫీస్‌ల నంబర్ల ద్వారా బట్వాడాలో సమస్యలు పరిష్కారమయ్యాయి.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి కరీంనగర్‌లో జిల్లాలో తపాలా శాఖ రెండు డివిజన్‌లుగా విస్తరించి ఉన్నది. కరీంనగర్, పెద్దపల్లి డివిజన్లుగా ఉన్నాయి. కరీంనగర్ డివిజన్‌లో కరీంనగర్, జగిత్యాలలలో రెండు తపాలా ప్రధాన కార్యాలయాలు ఉండగా, కరీంనగర్ పిన్‌కోడ్ 505 001 నుంచి పిన్‌కోడ్ వ్యవస్థ మొదలయింది. కరీంనగర్‌లో 52 సబ్ పోస్టాఫీసుల్లో 48 పిన్‌కోడ్‌లు ఉన్న పోస్టాఫీసులు ఉన్నాయి. మిగతా ఆరు టౌన్ సబ్ పోస్టాఫీసులు కరీంనగర్ పట్టణంలో-4, జగిత్యాలలో-1, సిరిసిల్లలో-1 పోస్టాఫీసులు ఉన్నాయి. కరీంనగర్ డివిజన్ వ్యాప్తంగా 389 బ్రాంచి పోస్టాఫీసులు ఉన్నాయి. బ్రాంచి పోస్టాఫీసుల్లో సబ్‌పోస్టాఫీసుకు అనుసంధానమైన పిన్‌కోడ్ ద్వారానే బ్రాంచి పోస్టాఫీసుల్లో ఉత్తరాలు బట్వాడా చేస్తున్నారు. పెద్దపల్లిలో డివిజన్‌లో పెద్దపల్లి, హుజూరాబాద్ ప్రధాన తపాలా కార్యాలయాలుకాగా, 40 సబ్ పోస్టాఫీసులకు నాలుగు టౌన్ సబ్‌పోస్టాఫీసులు ఉన్నాయి. ఇందులో పెద్దపల్లి-2, గోదావరిఖని-1, హుజూరాబాద్-1 టౌన్ పోస్టాఫీసులు ఉన్నాయి. బ్రాంచి పోస్టాఫీసులు 260 ఉన్నాయి. పెద్దపల్లి డివిజన్ వ్యాప్తంగా 36 సబ్ పోస్టాఫీసులకు పిన్‌కోడ్ వ్యవస్థ ఉంది. వీటి కిందున్న 260 బ్రాంచి పోస్టాఫీసులకు ఉత్తరాలను బట్వాడా చేస్తున్నారు. తపాలాశాఖ పూర్తిగా ఉత్తరాల బట్వాడాతోపాటు, తపాలా కార్యకలాపాలన్నీ పిన్‌కోడ్ వ్యవస్థ ద్వారానే చేపడుతున్నది.

అట్రాసిటీ కేసుపై ఏసీపీ విచారణ



సాక్షులను విచారిస్తున్న ఏసీపీ శుభం ప్రకాష్ నాగ్రోలు

గన్నేరువరం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం పోలీస్ స్టేషన్‌లో బుధవారం నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుపై గురువారం కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ నాగ్రోలు విచారణ చేపట్టారు. మండలంలోని సాంబయపల్లి గ్రామానికి చెందిన గడ్డం మహేందర్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన తన స్నేహితులు అనిల్‌రెడ్డి, అనంతరెడ్డి, తిరుపతిరెడ్డి కలిసి కారులో ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ మంగళవారం రాత్రి మైలారంలోని ఎస్సీ కాలనీ నుండి వెళుతున్నారు. ఆ సమయంలో కాలనీవాసులు కారును ఆపి వారిని మందలించారు. దీంతో కోపంతో మద్యం మత్తులో మహేందర్‌రెడ్డి అతడి స్నేహితులు కాలనీవాసులను కులం పేరుతో దూషించి బండరాయిలతో దాడి చేశారు. కాలనీవాసులు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వీరంగం సృష్టించిన యువకులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఎస్సీ కాలనీకి చెందిన జక్కనపల్లి లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై గురువారం ఏసీపీ మైలారం గ్రామంలో సాక్షులను విచారించి వాంగ్మూలం తీసుకున్నారు. ఏసీపీ వెంట స్థానిక ఎస్‌ఐ తాండ్ర నరేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

ఎలిగేడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపల్లిలో జరిగిన చోరీ కేసును జూలపల్లి పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. గత ఏడాది డిసెంబరు 27న ఉదయం 11గంటల సమయంలో అట్టేపల్లి లక్ష్మి(70)అనే వృద్ధురాలిని కొట్టి ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును దొంగిలించారు. గాయాలపాలైన వృద్ధురాలు అపస్మారక స్థితిలో ఉండడంతో స్థానికులు చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వృద్ధురాలు రెండురోజుల తరువాత మృతిచెందింది. దీంతో పోలీసులు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. చివరకు స్థానికులే దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చి కొత్తిరెడ్డి వేమరెడ్డి, గందం రవి, మడిగే అఖిలసాయి, గ్యాజంగి లక్ష్మణ్‌లను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. సుల్తానాబాద్ సీఐ సుబ్బా రెడ్డి ఆధ్వర్యంలో కేసు ఛేదించిన ఎస్సై నరేష్‌కుమార్, ఏఎస్సై తిరుపతి, హెచ్‌సీ శాంతయ్య, పీసీ స్వామిలను ఉన్నతాధికారులు అభినందించారు.

ప్రైవేటు ఉపాధ్యాయుడి ఆత్మహత్య

మల్లాపూర్, జనవరి, 16 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండల కేంద్రం శివారులో ప్రైవేటు ఉపాధ్యాయుడు గురువారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...కేరళ రాష్ట్రం అల్లాపి జిల్లా కొట్టనాడు మండలంలోని తగ్గిడి గ్రామానికి చెందిన శరదమందిరం రాజేష్(52)కు 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఉపాధి కోసం ఆరేళ్ల క్రితం మండలంలోని కొత్తదాంరాజు పల్లికి వచ్చి ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఏళ్లు గడిచినా పిల్లలు పుట్టకపోవడంతో భార్య గొడవ పెట్టుకుని పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో ఒంటరిగా ఉన్న రాజేష్ మనస్తాపానికి గురై మల్లాపూర్ మండల కేంద్రం శివారులోని దుబ్బగుట్ట ప్రాంతంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడిగా గుర్తించి కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

బైక్ ఢీకొని వృద్ధురాలి మృతి

మంథని, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మంథని మున్సిపల్ పరిధిలోని పాతపెట్రోల్ పంప్ చౌరస్తా సమీపంలో బైక్ ఢీకొని మండలంలోని సూరయ్యపల్లి గ్రామానికి చెందిన తాటి కమల(63) గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలు కమల కూరగాయల కోసం మంథనికి వచ్చి తిరిగి సూరయ్యపల్లికి నడిచి వెళ్తుండగా రంజిత్ అనే యువకుడు బైక్‌పై వస్తూ ఆమెను వెనుక నుంచి ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడు



సంజయ్(ఫైల్)

ధర్మారం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి యువకుడు మృతిచెందిన ఘటన ధర్మారం మండలంలో జరిగింది. ఎస్‌ఐ శీలం లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన నెరువట్ల సంజయ్(23) వ్యక్తిగత పనిమీద ధర్మారం వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో కటికెనపల్లి గ్రామశివారులో బైక్ అదుపు తప్పి సంజయ్ కిందపడ్డాడు. రోడ్డుపై పడడంతో యువకుడి తలకు తీవ్రగాయాలై అక్కడి క్కడే మృతిచెందాడు. సంజయ్ తండ్రి నెరువట్ల రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు.

సౌదీ బాధితుడి సమస్యపై స్పందించిన సీఎంవో

జగిత్యాల అర్బన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వీసా గడువు ముగిసి సౌదీ అరేబియాలో చిక్కుకున్న జగిత్యాల పట్టణానికి చెందిన కుక్కల భీమయ్యను భారతదేశానికి రప్పించాలని అతని భార్య గంగలక్ష్మి మెయిల్ ద్వారా ముఖ్యమంత్రికి చేసిన విజ్ఞప్తికి గురువారం ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించింది. సాధారణ పరిపాలనా శాఖ ప్రవాసీ భారతీయుల విభాగం కార్యదర్శి రఘునందన్‌రావు ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా ఢిల్లీలోని విదేశీ వ్యవహారాల శాఖకు సౌదీ అరేబియాలోని భారత రాయబారికి సమాచారం పంపారు. భీమయ్య కుమారుని శస్త్ర చికిత్స కోసం భీమయ్య ఎముక మూలుగ అవసరం కావడంతో భీమయ్య అత్యవసరంగా భారతదేశానికి రావాల్సి ఉంది. ఎన్‌ఆర్‌ఐ సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి ఎక్స్‌లో చేసిన విజ్ఞప్తికి స్పందించిన సౌదీలోని సామాజిక సేవకులు గాజుల నరేష్ ఇండియన్ ఎంబసీతో సమన్వయం చేస్తున్నారు.

విధులకు ఆటంకం కలిగించిన ఒకరి అరెస్ట్

తంగళ్లపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పోలీసు విధులకు ఆటంకం కలిగించిన తంగళ్లపల్లి మండలం రామన్నపల్లె గ్రామానికి చెందిన గుండి ప్రశాంత్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రాంమోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీన రాత్రి గుండి ప్రశాంత్ గ్రామంలోని ఐకేపీ సెంటర్ వద్ద బహిరంగంగా మద్యం సేవిస్తున్నాడు. విధుల్లో భాగంగా బ్లూ కోల్ట్స్ పోలీసులు ప్రశాంత్‌ను వివరాలు అడగగా దురుసుగా ప్రవర్తిస్తూ పోలీసులను నెట్టివేసి విధులకు ఆటంకం కలిగించినట్లు తెలిపారు. బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ ప్రశాంత్ ఫిర్యాదు మేరకు గుండి ప్రశాంత్‌ను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోనరావుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలవాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వట్టిమల్ల గ్రామానికి చెందిన బాణాల రమేష్ తన ట్రాక్టర్ ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని కోనరావుపేట పోలీస్‌స్టేషన్ తరలించి కేసు నమోదు చేసి రిమాండ్ పంపినట్లు తెలిపారు.

లోన్ డబ్బులు కట్టాలన్నందుకు..
బ్యాంక్ ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- కేసు నమోదు చేసిన పోలీసులు

ధర్మపురి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండల కేంద్రంలోని కేడీసీసీ బ్యాంక్ ఎదుట సోమ మల్లేశం అనే వ్యక్తి పెట్రోల్ పోసుకుని గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బుగ్గారం మండలంలోని మద్దునూర్ గ్రామానికి చెందిన మల్లేశం తండ్రి సోమ రాజమల్లయ్య గతంలో తన భూమి తాకట్టు పెట్టి బ్యాంక్ నుంచి మార్టిగేజ్ లోన్ తీసుకున్నాడు. రెండేళ్ల వరకు బ్యాంక్ ఇన్‌స్టాల్‌మెంట్స్ కట్టిన రాజమల్లయ్య అనంతరం మృతి చెందాడు. తరువాత బ్యాంక్‌కు భూమి తాకట్టు పడి ఉండగానే మల్లేశం తన తల్లి, భార్య, తన పేరట ఇటీవల విరాసత్ చేయించాడు. బ్యాంక్ ఇన్‌స్టాల్‌మెంట్స్ పెండింగ్‌లో ఉన్నాయని మల్లేష్‌కు బ్యాంక్ అధికారులు సమాచారం అందించారు. బ్యాంక్ లోన్ కడుతానని చెప్పి అప్పటి నుంచి మల్లేష్ తప్పించుకుంటున్నాడు. ఇటీవల తన తల్లి బ్యాంక్ అకౌంట్‌లో ధాన్యం విక్రయించగా వచ్చిన డబ్బులు జమయ్యాయి. తన తల్లిని తీసుకుని బ్యాంక్ వచ్చి డబ్బులు డ్రా చేస్తుండగా అధికారులు లోన్ విషయం మాట్లాడారు. దీంతో బ్యాంక్ అధికారులు, మల్లేష్ మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహించిన సోమ మల్లేశం పెట్రోల్ ఒంటిపై పోసుకునేందుకు ప్రయత్నం చేయగా బ్యాంక్ అధికారులు అడ్డుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి సముదాయించారు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తన తల్లి పేరట బ్యాంక్‌లో ఉన్న సుమారు 3 లక్షల వరకు డబ్బులు లోన్ కింద కట్ చేసి లోన్ క్లియర్ చేశారు. దీంతో మల్లేశం ఆగ్రహం వ్యక్తం చేసి బ్యాంక్ అద్దాలు పగుల గొట్టడంతో పాటు గొడవకు దిగారు. దీంతో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ ఉదయ్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మల్లేశం గతంలో భార్యను చంపి జైలుకు వెళ్లి వచ్చినట్లు కేసు కూడా ఉంది.



ఆత్మహత్యాయత్నం చేసిన సోమ మల్లేశం

శతాధిక వృద్ధురాలు మృతి



శ్రీపల్లి గంగమ్మ

కోరుట్లరూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు శ్రీపల్లి గంగమ్మ (109) బుధవారం రాత్రి మృతి చెందింది. గంగమ్మ వయోభారం, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. గంగమ్మ భర్త భూమయ్య 20 ఏళ్ల క్రితం మృతి చెందాడు. గంగమ్మ గ్రామంలో తన ఇంట్లో నివాసం ఉంటోంది. గంగమ్మకు ముగ్గురు కొడుకులు, ఐదుగురు కూతుళ్లున్నారు. గంగమ్మ అంత్య క్రియలు గ్రామంలో కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామస్థులు నిర్వహించారు.

మోటార్‌సైకిళ్ల దొంగ అరెస్టు

- మూడు బైక్‌లు స్వాధీనం
- వెల్లడించిన పెద్దపల్లి ఏసీపీ కృష్ణ



ఎస్సై శ్రావణ్‌కు రివార్డు అందజేస్తున్న ఏసీపీ కృష్ణ

సుల్తానాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల దొంగను సుల్తానాబాద్ పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి మూడు మోటార్‌సైకిళ్ల స్వాధీనం చేసుకున్నారు. సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ వివరాలను వెల్లడించారు. సుల్తానాబాద్ ఇందిరానగర్‌కు చెందిన ఎండీ ముభాషీర్, సుల్తానాబాద్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన కాల్వ రాహుల్, కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన పిక్కల రాములు తమ బైక్‌లు చోరీకి గురైనట్టు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీలపై సుల్తానాబాద్ ఎస్‌ఐ శ్రావణ్ కుమార్, పోలీసు బృందం దర్యాప్తు చేస్తున్న సందర్భంలో పాత నేరస్తుడు అల్లీపూర్ గ్రామానికి చెందిన బాలసాని అజయ్‌పై అనుమానం వచ్చింది. అతడి ఇంటిని తనిఖీ చేయగా ఇంట్లో మూడు ద్విచక్ర వాహనాలు లభ్యమయ్యాయి. బాలసాని అజయ్ గతంలో ఇలాగే దొంగతనాల కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. ఆదాయం సరిపోక బైక్‌ల చోరీకి పాల్పడుతున్నాడని, దొంగిలించిన బైక్‌లను అమ్మే ప్రయత్నంలో ఉండగా గురువారం పోలీసులు అతడిని పట్టుకుని మూడు బైక్‌లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారని ఏసీపీ తెలిపారు. బైక్ దొంగను పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్‌ఐ శ్రావణ్‌కు ఏసీపీ రివార్డు అందజేశారు. ఈ సమావేశంలో సీఐ సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సుల్తానాబాద్ , జనవరి 16: (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం నమ్నూర్ గ్రామానికి చెందిన జోకే అజయ్ (20) అనే యువకుడు సుల్తానాబాద్ పట్టణంలోని అశోక్‌నగర్‌లోని తమ బంధువుల వద్దకు వచ్చాడు. తిరిగి మానకొండూరు మండలంలో ఉన్న మరికొందరు బంధువులను కలిసేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా బుధవారం ఉదయం ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడ్డాడు. ఇతన్ని మొదట కరీంనగర్, ఆ తర్వాత గురువారం ఉదయం ఎంజీఎం వరంగల్ కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

ధాన్యం చోరీ నిందితుల అరెస్ట్

- 40 క్వింటాళ్ల ధాన్యం, 40 వేల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్

గంభీరావుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలంలో ఇటీవల ధాన్యం చోరీ చేసిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్టు సీఐ శ్రీనివాస్‌గౌడ్ గురువారం తెలిపారు. వారి నుంచి 40 క్వింటాళ్ల ధాన్యం, 40 వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాస్‌గౌడ్ వివరాలను వెల్లడించారు. మండలంలోని నర్మాల, మల్లారెడ్డిపేట గ్రామాల్లో ఇటీవల ఆరబెట్టిన 40 క్వింటాళ్ల ధాన్యాన్ని ఎత్తుకెళ్లారు. మల్లారెడ్డిపేట కమాన్ వద్ద పోలీసులు గురువారం సోదాలు నిర్వహిస్తుండగా, బీంగల్, ఘన్‌పూర్‌కు చెందిన రాజేశ్వర్, పర్శరాములు అనే వ్యక్తులు ధాన్యాన్ని వాహనాల్లో తీసుకెళుతూ పట్టుబడ్డారు. వీరిద్దరు ఈ ప్రాంతంలో రోజూ ఉల్లిగడ్డల వ్యాపారం చేస్తూ ఆరబెట్టిన ధాన్యాన్ని దొంగలించారు. దొంగలించిన ధాన్యాన్ని అమ్మేందుకు రెండు వ్యాన్లలో తరలిస్తుండగా, మల్లారెడ్డిపేట కమాన్ వద్ద పట్టుకున్నామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. 40 క్వింటాళ్ల ధాన్యం, 40 వేల నగదును స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

- **వీర్నపల్లిలో ఒకరు..**

వీర్నపల్లి మండలంలో ఇటీవల ధాన్యాన్ని దొంగిలించిన గంభీరావుపేట మండలం దమ్మన్నపేటకు చెందిన స్వామిని అరెస్ట్ చేశామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. స్వామి నుంచి 7 బస్తాల ధాన్యాన్ని, స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించి, ధాన్యం చోరీ చేసిన నిందితులను పట్టుకున్న ఏఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డిని, కానిస్టేబుల్స్ శ్రీనాథ్, శ్రీనివాస్‌ను సీఐ శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు. ఎస్‌ఐ శ్రీకాంత్ ఉన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌ల తనిఖీ

- నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న ఆసుపత్రులు సీజ్

ఎల్లారెడ్డిపేట జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లు, మెడికల్ షాపుల్లో గురువారం అధికారులు దాడులు నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గొల్లపల్లిలోని పీఎంపీ క్లినిక్‌లు, మందుల దుకాణాలపై దాడులు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రోగులకు ఇంజక్షన్లు, స్టెరాయిడ్స్ కాలం చెల్లిన మందులను విక్రయిస్తున్నట్లు తనిఖీల్లో బయటపడ్డాయి. వాటిని స్వాధీనపరచుకొని గొల్లపల్లికి చెందిన పీఎంపీ కొండ అంజనేయులును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండల కేంద్రం లోని పీఎంపీ నాగరాజు అందుబాటులో లేకపోవడంతో క్లినిక్‌ను సీజ్ చేశారు. తహసీల్దార్ రామచంద్రం, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్, మండల వైద్యాధికారి సారియా అంజుమ్ పాల్గొన్నారు.

- వీర్నపల్లి: మండల కేంద్రంతో పాటు గర్జనపల్లి, రంగరపేట గ్రామాల్లో పోలీస్, రెవెన్యూ వైద్యాధికారులు ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై, మెడికల్ దుకాణాలపై దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించని క్లినిక్, మెడికల్ షాపులు నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీలు తాళాలు వేసి పరారయ్యారు. కొన్ని చోట్ల అధికారుల దాడుల్లో నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ షాపుల్లో అమ్ముతున్న స్టెరాయిడ్స్ యాంటీబయోటిక్, ఫ్లూయిడ్స్‌ను అధికారులు సీజ్ చేశారు. మండల కేంద్రంలో ఆర్‌ఎంపీలు ఆసుపత్రి మాదిరిగా బెడ్‌లు వేసి వైద్యం అందించడంతో గదులకు సీజ్ చేసి తాళాలు వేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న మణికంఠ క్లినిక్‌ను సీజ్ చేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ సరియా అంజూమ్ తెలిపారు.
- గంభీరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో మెడికల్ ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లీనిక్‌లపై రెవెన్యూ, ప్రభుత్వ వైద్యాధికారులు గురువారం రాత్రి ఆకస్మికంగా సోదాలు నిర్వహించారు. గంభీరావుపేటలో రెండు, దమ్మన్నపేటలో ఒకటి, లింగన్నపేటలో ఒకటి మెడికల్ క్లినిక్‌లపై సోదాలు చేసి మందులను పరిశీలించారు. తనిఖీల్లో తహసీల్దార్ భూపతి, ఎస్‌ఐ శ్రీకాంత్, వైద్యాధికారి వేణుగోపాల్ ఉన్నారు.



చందుర్తిలో మెడికల్ షాప్ తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాస్

- ఇల్లంతకుంట: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మండలకేంద్రంలో నడుస్తున్న మూడు ప్రైవేట్ ఆసుపత్రులను సీజ్ చేసినట్లు వైద్యాధికారిణి శరణ్య తెలిపారు. జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు గురువారం తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. తనిఖీలలో సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, తహసీల్దార్ ఫారూఖ్, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, వైద్యాధికారిణి జీవనజ్యోతి తదితరులు పాల్గొన్నారు.
- చందుర్తి: మండల కేంద్రంతో పాటు నర్సింగాపూర్, జోగాపూర్, కిష్టంపేట, రామన్నపేట, మల్యాల గ్రామాల్లోని ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లతో పాటు మెడికల్ షాప్‌లపై వైద్య, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారుల బృందాలు గురువారం రాత్రి తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న క్లినిక్‌లు, మెడికల్ షాపుల సీజ్ చేశారు. వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, మండల వైద్యాధికారి వేదాచారి, తహసీల్దార్ శ్రీనివాస్, చందుర్తి, సిరిసిల్ల ఎస్సైలు అంజయ్య, కిరణ్ పాల్గొన్నారు.

నేడు రుద్రవరంలో తెప్పల పోటీలు

● హాజరుకానున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలోని మిడ్‌మానేరు బ్యాక్ వాటర్‌లో నిర్వహించే తెప్పల పోటీలకు సర్వం సిద్ధం అయింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న మత్స్య కార్మికులు ఈ పోటీల్లో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే వేములవాడ పట్టణం, రుద్రవరం, అనుపురం, నాంపల్లి, చింతలఠాణ, పాత చీర్లవంచ, సంకెపల్లి, విలసాగర్ గ్రామాలకు చెందిన మత్స్య కార్మిక యువకులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు ముందుకు వచ్చారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు పాత రుద్రవరం గ్రామంలోని వాటర్ గ్రిడ్ సమీపంలో తెప్పల పోటీలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదగా గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తారు.

రూ.7,300 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,300 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు ఏడుగురు రైతులు 71క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు మూడు క్వింటాళ్ల గోనె సంచుల్లో అమ్మకానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,300, కనిష్ఠ ధర 6,400 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోలు చేశారు.

జాతీయ పురస్కారానికి ఎంపిక


రవళి

వెల్గటూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం మొక్కట్రావుపేట గ్రామానికి చెందిన బావండ్లపెల్లి రవళి అనే యువతి జాతీయ పురస్కారానికి ఎంపి కయ్యారు. శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21న విజయవాడలో జరిగే కార్యక్రమంలో రవళికి పురస్కారం అందించనున్నారు.

అందని రక్షిత నీరు

● మిషన్ భగీరథ మోటార్లకు తరచూ మరమ్మతులు
● గ్రామాల్లో ఇబ్బందులు
● సరిపడా తాగు నీరందక తప్పని తిప్పలు



పట్టణంలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్

జిల్లా అంతటికి తాగు నీరు

డబ్బాలో నిర్మించిన వాటర్ గ్రిడ్ నుంచి జిల్లా అంతటికి తాగునీటి సరఫరా అవుతుంది. ఇందులో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీలతో పాటు జిల్లాలోని 343 గ్రామాల ప్రజలకు మిషన్ భగీరథ తాగునీటిని అందిస్తున్నారు. ఇక్కడ చిన్న మరమ్మతు ఏర్పడినా జిల్లా అంతటికి తాగు నీరు అందడం ఇబ్బందిగా మారుతుంది. ప్రస్తుతానికి పాత మంచి నీటి పథకాల్లో నీరు అందుబాటులో ఉండటంతో సరఫరాకు ఇబ్బంది లేదు. వేసవి సమీపిస్తున్నందున్న భగీరథ నీరు రాకపోతే కష్టాలు తప్పవని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతధికారులు దృష్టి సారించి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి తాగునీటి కష్టాలు లేకుండా చూడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



మెట్‌పల్లిలోని పంప్‌హౌస్

మెట్‌పల్లిటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలంలో మిషన్ భగీరథ నీటి సరఫరా సమస్య నిత్యం వెంటాడుతూనే ఉంది. జగిత్యాల జిల్లాలోని ప్రతీ పల్లెకు తాగు నీరందించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టింది. జగిత్యాల జిల్లా అంతటికి తాగు నీరు అందించేందుకు ఇబ్రహీంపట్నం మండలం డబ్బ గ్రామ శివారులో బీఆర్ఎస్ ప్రభుత్వం వాటర్ గ్రిడ్ నిర్మాణం చేపట్టింది. ఇంత వరకు బాగానే ఉన్నా నీరు అందించడంలో అధికార యంత్రంగం పూర్తిగా విఫలమైందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

గతంలో కూడ భగీరథ నీరు సక్రమంగా రాగ ప్రజలు ఇబ్బందులు ఎదురయ్యాయి. నిటీ సరఫరా సక్రమంగా లేక పలుమార్లు ప్రజలు ఆందోళనలు కూడా చేసిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు ఎప్పటికప్పుడు సమస్య పరిష్కరిస్తున్నా మళ్లీ మళ్లీ పునరావృతం అవుతూనే ఉంది. డబ్బ నుంచి వివిధ గ్రామాలకు నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ప్రధాన పైప్ లైన్‌లు నిత్యం పగలడంతో ఈ సమస్య ఎదురవుతోంది. ఇలా వాటర్ గ్రిడ్ నుంచి కేవలం 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న అమ్మక్కపేట వద్ద రెండు చోట్ల పైపులు పలుమార్లు పగిలి ఇబ్బందులు ఎదురయ్యాయి. అదే విధంగా మెట్‌పల్లి పట్టణ శివారులోని వెంకట్రావ్‌పేట గ్రామం వద్ద రెండు చోట్ల నిత్యం మెయిన్ పైపులు పగులుతూనే ఉన్నాయి. ప్రారంభంలోనే పైపులు పగలడంతో అన్ని గ్రామాలకు నీటి సరఫరా మూడు రోజుల పాటు నిలిచిపోయిన సందర్భాలున్నాయి. కోట్ల నిధులతో నిర్మించిన ప్రాజెక్ట్ నాణ్యతా లోపం కారణంగా మరమ్మతులు గురవుతుండటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతుల్లో జాప్యం

డబ్బ వాటర్ గ్రిడ్ వద్ద ఏర్పాటు చేసిన మూడు పంపు మోటార్లు కొన్ని రోజులుగా మరమ్మతులకు నోచుకోవడంతో తాగు నీరు సరఫరా కావడం లేదు. ఒక్కో పంపు మోటారు 403 హెచ్‌పి సామర్థ్యం కలిగి ఉంటుంది. ఇందులో మూడు చెడిపోగా ప్రస్తుతం రెండు మోటార్లు మాత్రమే రన్నింగ్‌లో ఉన్నాయి. ప్రతీ రోజు జిల్లా అంతటికీ 90 ఎంఎల్‌డి(మిలియన్ లీటర్స్ పర్ డే) నీరు అవసరం ఉండగా ప్రస్తుతం 65 ఎంఎల్‌డి నీరు మాత్రమే సప్లై చేస్తున్నారు. దీంతో ప్రజలకు సరిపడా తాగు నీరు అందడం లేదు. కాగ చెడిపోయిన పంపులను మరమ్మతుల నిమిత్తం హైదారాబాద్‌కు తరలించారు. ఇందులో ఒక పంపు మోటారు రిపేర్ పూర్తి అయ్యిందని రెండు రోజుల్లో బిగించనున్నట్లు అధికారులు తెలిపారు.


డబ్బ గ్రామ శివారులో వాటర్ గ్రిడ్

రేపు నవోదయ ప్రవేశపరీక్ష

● ఉమ్మడి జిల్లాలో 34 కేంద్రాలు ఏర్పాటు
● హాజరు కానున్న 6,806 మంది విద్యార్థులు

చొప్పదండి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి శనివారం నిర్వహించే పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. నవోదయ విద్యాలయంలో ప్రవేశపరీక్ష నిర్వహణపై గురువారం అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 34 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. 6,806 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలో కరీంనగర్ జిల్లాలో 2,105 మంది విద్యార్థులు, జగిత్యాల జిల్లాలో 2,229 మంది, పెద్దపల్లి జిల్లాలో 1,028 మంది, సిరిసిల్ల జిల్లాలో 954 మంది, సిద్దిపేట జిల్లాలో 264 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 115 మంది, హనుమకొండ జిల్లాలో 111 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు ఆమె తెలిపారు. పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డును వెంట తీసుకురావాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈవో అశోక్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పెన్షనర్ల వైద్య ఖర్చులపై ఉత్తర్వులు

జగిత్యాల అర్బన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రభుత్వం నుంచి వైద్య ఖర్చులు పొందడానికి వివరణాత్మక ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిందని పెన్షనర్స్ అసోసిషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనర్లు ఆరోగ్య బీమా తీసుకుని వైద్య ఖర్చులను ఆ సంస్థ నుంచి పొంది తిరిగి ప్రభుత్వం నుంచి మెడికల్ రీ ఎంబర్స్‌మెంట్ పొందవచ్చునా అనే దానిపై స్పష్టత కోసం తమ అసోసియేషన్ సమర్పించిన వినతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్పష్టత ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు పెన్షనర్లు ఆరోగ్య బీమా తీసుకుంటే ఆ సంస్థ నుంచి డబ్బులు పొంది ప్రభుత్వం నుంచి తిరిగి రీయింబర్స్‌మెంట్ పొందవచ్చునని, అయితే మొత్తం అయిన ఖర్చులు మించకూడదన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వెనుకబడిన తరగతుల ఉద్యోగ, నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రం కరీంనగర్ వారిచే ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణకు ఉమ్మడి జిల్లాకు చెందిన నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ కరీంనగర్ డైరెక్టర్ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈనెల 20నుంచి ఫిబ్రవరి9 వరకు దరఖాస్తులు సమర్పించాలన్నారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో లక్షా50వేల రూపాయలలోపు, పట్టణాల్లో 2లక్షల రూపాయలలోపు ఉండాలన్నారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఫోన్ నంబర్ 080-2268686లో లేదా బీసీ స్టడీసర్కిల్, కరీంనగర్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

రమణీయం రామలింగేశ్వరుడి రథోత్సవం

● రథం లాగడానికి పోటీపడిన భక్తులు ● తలపై గండదీపంతో ప్రదక్షిణలు


స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగమరెడ్డిపల్లె గ్రామంలో రామలింగేశ్వరుడి రథోత్సవం రమణీయంగా జరిగింది. గ్రామంలోని రామలింగేశ్వర స్వామి మహోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం నిర్వహించారు. ఆలయం చుట్టూ రథం తిరగడం ఆనవాయితీ కాగా రథాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు. తలపై గండదీపం పెట్టుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు రావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. సిరిసిల్ల రూరల్ సీఐ మొగలి, ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. పార్కింగ్ దూరంగా ఏర్పాటు చేయడంపై భక్తులు అసహనం వ్యక్తం చేశారు.

దర్శించుకున్న ప్రముఖులు

రామలింగేశ్వర స్వామి ఉత్సవాలల్లో భాగంగా జరిగిన రథోత్సవంలో పలువురు ప్రముఖులు పాల్గొని మొక్కులు తీర్చుకోగా, ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ ఐరెడ్డి చైతన్యమహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు రాఘవరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి నాయకులు వినయ్‌కుమార్, పసుల వెంకటి, ఉడుతల వెంకన్న, కేవీఎన్‌రెడ్డి, తూముకుంట శ్రీలత, తూముకుంట రాజేందర్‌రెడ్డి దర్శించుకున్నారు.


రథం లాగుతున్న భక్తులు

స్టడీ టూర్‌కు గొల్లపల్లి ఏఎంసీ పాలకవర్గం


స్టడీ టూర్‌కు బయలుదేరుతున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు

గొల్లపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం గురువారం స్టడీ టూర్‌కు బయలు దేరారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్ భీమ సంతోష్, వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డితో పాటు మార్కెట్ డైరెక్టర్లు, కార్యాలయం సిబ్బంది స్టడీ టూర్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా గొల్లపల్లి మండల కేంద్రంలో మార్కెట్ కార్యదర్శి ఫైజోద్దీన్ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. తిరుపతి, ఖమ్మంతో పాటు తమిళనాడులోని మరో పెద్ద వ్యవసాయ మార్కెట్ యార్డులను సందర్శించేందుకు వెళ్తున్నట్లు చైర్మన్ సంతోష్ తెలిపారు. ఆయా మార్కెట్ యార్డుల్లో రైతులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను, మార్కెట్ యార్డుల నిర్వహణ, రైతుల సంక్షేమం, వారి అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల గురించి తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ట్రైనీ ఐపీఎస్ వసుంధరయాదవ్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ట్రైనీ ఐపీఎస్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ట్రైనీ ఐపీఎస్ వసుంధరయాదవ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రం లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో కరీంనగర్, సిరిసిల్ల, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్ ఐదు జిల్లాల కరీంనగర్ జోన్‌స్థాయి పోలీసు జట్ల ఎంపిక పోటీలను మహిళలు, పురుషుల విభాగాల్లో నిర్వహించారు. ఈ పోటీలకు జోన్‌లోని ఐదు జిల్లాల నుంచి 400మంది క్రీడాకారులు హాజరయ్యారు. కబడ్డీ క్రీడాకారులను ఆమె పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోలీసు క్రీడల్లో కరీంనగర్ జోన్ జట్లు విజయ కేతనం ఎగుర వేయాలన్నారు. కరీంనగర్‌లో రాష్ట్రస్థాయి పోలీసు క్రీడల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏసీపీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగులకు క్రీడలు ఆటవిడుపుగా పనిచేస్తాయన్నారు. అనంతరం క్రీడాకారులకు ఖో ఖో, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్ తదితర క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించారు. ఈ పోటీల నిర్వహణలో ఆర్ఐలు కుమారస్వామి, జానీమియ, సీఐ సంతోష్, ఆర్ఎస్ఐలు రాజు, మహేశ్, లేక్ పీఎస్ రాజు, డీవైఎస్‌వో శ్రీనివాస్, వివిధ జిల్లాల క్రీడా సంఘాల ప్రధాన కార్యదర్శులు మహేందర్‌రావు, గిన్నె లక్ష్మణ్, మల్లేశ్, ప్రతినిధులు సిహెచ్ సంపత్‌రావు, వి సూర్యప్రకాశ్, కట్ట సంతోష్ పాల్గొన్నారు.


కబడ్డీ ఆడుతున్న పోలీసు క్రీడాకారులు

రాజన్నకు భక్తుల మొక్కులు


వేములవాడ రాజన్న ఆలయంలో భక్తులు


కొండగట్టులో కుటుంబ సభ్యులతో నటి అనిత

వేములవాడ కల్చరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారికి గురువారం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని వరుస సెలవుల నేపథ్యంలో గురువారం రాజన్న ఆలయానికి భక్తుల తాకిడి మరింత పెరిగింది. భక్తులు తెల్లవారుజామునే ఆలయ కల్యాణకట్టలతో తలనీలాలు సమర్పించుకుని, ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారికి పట్నం వేసి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంజన్న సన్నిధిలో బుల్లితెర నటి

మల్యాల: కొండగట్టు అంజనేయస్వామిని గురువారం బుల్లితెర నటి కోమాకుల అనిత దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చి స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. నా పేరు మీనాక్షి, మనసిచ్చి చూడు, ముత్యాల ముగ్గు సీరియల్‌లలో నటించినట్లు ఈ సందర్భంగా అనిత తెలిపారు. వీటితో పాటు ప్రస్తుతం గుండమ్మ గారి కథ సీరియల్‌లో విలన్‌గా కూడా కనిపిస్తున్నానని అన్నారు. ఆలయ అధికారులు వారి వెంట ఉన్నారు

వైభవంగా తిరుపావడోత్సవం

కోరుట్ల: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర దేవాలయంలో గురువారం వైభవంగా తిరుపావడోత్సవం నిర్వహించారు. దేవాలయంలో వేదపండితుడు బీర్నంది నర్సింహాచారి మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. పులిహోర ప్రసాదంతో ప్రత్యేక పూజలు జరిపారు. ఈవో విక్రం, సిబ్బంది, అండాల్ గోష్టి సభ్యులు పాల్గొన్నారు.


కోరుట్ల వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నపూజ


పూజలో పాల్గొన్న భక్తులు

ఎస్‌యూలో అంతర్గత బదిలీలు

గణేశ్‌నగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారులను అంతర్గత బదిలీలు చేస్తూ వీసీ యు ఉమేష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ హరికాంత్‌ను వీసీకి ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గా నియామకం చేశారు. ఉర్దూ విభాగంలో పనిచేస్తున్న హుమేరా తస్లీమ్‌ను శాతవాహన ఎస్టేట్ ఆఫీసర్‌గా, డాక్టర్ మహమ్మద్ జాఫర్‌ను డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్‌కి డైరెక్టర్‌గా, డాక్టర్ అబ్రారుల్ బకీని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్‌గా, డాక్టర్ మనోహర్‌ను చీఫ్ వార్డెన్‌గా, మేనేజ్‌మెంట్ విభాగానికి బీఓఎస్‌గా, డాక్టర్ సరసిజను అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్‌గా, చైర్మన్ బీవోఎస్ కెమిస్ట్రీగా నియమించారు. డాక్టర్ శ్రీరంగ ప్రసాద్‌ను బిజినెస్ మేనేజ్‌మెంట్ శాఖ అధిపతిగా, డాక్టర్ శ్రీవాణిని, ఎకనామిక్స్ శాఖ అధిపతిగా, విజయ ప్రకాష్‌ను ప్రజా సంబంధాల అధికారిగా, ఇన్‌చార్జి ఆంగ్లశాఖాధిపతిగా నియమించారు. డాక్టర్ జోసెఫ్ రాజును ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌చార్జి శాఖ అధిపతి గా, డాక్టర్ ప్రసాద్‌ను మ్యాథమెటిక్స్ ఇన్‌చార్జి శాఖ అధిపతిగా, డాక్టర్ ఎస్ కిరణ్‌ను వృక్షశాస్త్ర అధిపతిగా, డాక్టర్ అర్జున్‌ను కంప్యూటర్ సైన్స్ శాఖ అధిపతిగా నియామకం చేశారు. డాక్టర్ తిరుపతిని కోఆర్డినేటర్ కాన్ఫిడెన్షియల్ సెక్షన్ విభాగంలో, డాక్టర్ మనోజ్ కుమార్‌ను యూత్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా నియామక పత్రాలు అందించారు. అధ్యాపకేతర సిబ్బంది సంతోష్ కుమార్‌ను వీసీ వ్యక్తిగత కార్యదర్శిగా, మారుతిని వీసీ వ్యక్తిగత సహాయకులుగా, శ్రీకాంత్‌ను రిజిస్ట్రార్ వ్యక్తిగత సహాయకులుగా నియామకం చేశారు. నూతనంగా నియామకమైన సంచాలకులు, విభాగాధిపతులు విశ్వవిద్యాలయ ఉపకులపతికి, రిజిస్ట్రార్‌కు ధన్యవాదాలు తెలిపారు.


డాక్టర్ హరికాంత్‌కు ఓఎస్డీగా నియామక పత్రం అందిస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం

బాలభవన్ సూపరింటెండెంట్ మంజులాదేవి



ఫటాఫట్

ప్రశ్న: బాలభవన్ ప్రధాన లక్ష్యం ఏంటి?

జవాబు: విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడమే బాల భవన్ లక్ష్యం.

ప్రశ్న: ఏయే అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు?

జవాబు: రోజూ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు 5-16 సంవత్సరాల బాలబాలికలకు సంగీతం, డ్యాన్స్, (ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్), డ్రాయింగ్, మృదంగం అంశాల్లో శిక్షణ ఇస్తున్నాం.

ప్రశ్న: ఎంత మంది విద్యార్థులు వస్తారు?

జవాబు: ప్రతీ రోజూ 60 నుంచి 100 మంది వస్తున్నారు. వేసవి శిక్షణా శిబిరానికి 700కు పైగా విద్యార్థులు హాజరవుతారు.

ప్రశ్న: ఎంత మంది సిబ్బంది ఉన్నారు?

జవాబు: మొత్తం ఐదుగురం పని చేస్తున్నాం. వేసవిలో అదనంగా తాత్కాలికంగా ముగ్గురు వస్తారు.

ప్రశ్న: విద్యార్థుల చేరికకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: కరీంనగర్ బాలభవన్ గ్రూప్ ఏర్పాటు చేసి ఏయే సమయాల్లో ఏయే కళలను నేర్పిస్తారో చెబుతున్నాం. రెగ్యులర్ విద్యార్థులతో పాటు వేసవిలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, వారి తల్లి దండ్రుల నుంచి మంచి స్పందన లభిస్తోంది.

-కరీంనగర్ కల్చరల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జనవరి16 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ మరమ్మతులో భాగంగా శుక్రవారం ఉదయం 9:30గంటల నుంచి 11:30 వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్, టు, ఏడీఈలు పంజాల శ్రీనివాస్‌గౌడ్, ఎం లావణ్యలు తెలిపారు. ఆకుల శైలజ హాస్పిటల్ ప్రాంతం, మంకమ్మతోట, పాత కార్మిక అడ్డా, హనుమాన్ ఆలయ ప్రాంతం ,దంగరివాడి పాఠశాల ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

●మధ్యాహ్నం 1:30 గంటల నుంచి 3:30వరకు రాంనగర్, ప్రగతినగర్, సప్తగిరి కాలని, రామాలయం ఆలయ ప్రాంతం, హసన్‌పురి కాలనీ, టెలిఫోన్ క్వార్టర్స్ ప్రాంతం, మార్కండేయ నగర్, సాయి బాబా ఆలయ ప్రాంతంలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

●ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాంనగర్, సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంతం, చేపల మార్కెట్ ప్రాంతం, బొబ్బిలి లక్ష్మయ్య అపార్ట్‌మెంట్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 1:30గంటల వరకు కోతిరాంపూర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఈసందర్భంగా టౌన్ వన్, టు ఏడీఈలు పంజాల శ్రీనివాస్‌గౌడ్, ఎం లావణ్యలు కోరారు.

'మాదకద్రవ్యాల నిరోధానికి చర్యలు'



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నిరోధానికి ఎక్సైజ్, పోలీసు అధికారులు చర్యలు తీసుకొని, వాటి బారిన విద్యార్థులు పడకుండా చూడాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనపై ఎక్సైజ్, పోలీస్ సహా వివిధ శాఖల అధికారులతో గురువారం వర్చువల్ ద్వారా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో కళాశాలలు, వివిధ వసతి గృహాలను సందర్శించాలని అన్నారు. అక్కడ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి విద్యార్థులు పెడదోవ పట్టకుండా చూడాలని పేర్కొన్నారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్ వాడకం పూర్తిగా నిరోధించాలని సూచించారు. విద్యార్థులు ఎవరైనా డ్రగ్స్ వినియోగించినట్లు తేలితే వారికి డీఅడిక్షన్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ఇప్పించాలని అన్నారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు పరిశీలించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. ఏవైనా అనుమానాలు ఉంటే ఉన్నతాధికారులకు తక్షణమే సమాచారం ఇవ్వాలని అన్నారు. సమావేశంలో ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్, ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ శ్రీనివాస్, జిల్లా విద్యాధికారి జనార్దన్, వ్యవసాయ అధికారి విజయ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పాలనపై తప్పుడు ప్రచారం'



మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, జనవరి16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా పాలనను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నదని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందు కౌశిక్‌రెడ్డిపై ఒక్క కేసు లేదని అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్నారు. హరీష్‌రావు, కేటీఆర్, కౌశిక్‌రెడ్డిలు మీడియాను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి ఆధారాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013 నుంచి కౌశిక్‌రెడ్డిపై కేసుల పరంపర కొనసాగుతోందన్నారు. 2013, 2017లో బెదిరింపులు, దౌర్జన్యం, భూకబ్జాలకు సంబంధించి 17 కేసులు కేసీఆర్ ప్రభుత్వంలోనే నమోదు అయ్యాయని విమర్శించారు. 2014 నుంచి 2023 వరకు కౌశిక్‌రెడ్డిపై నమోదైన కేసులకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏవిధంగా బాధ్యత వహిస్తుందని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డి సచ్ఛీలుడని క్లీన్ చిట్ ఇస్తున్న హరీష్‌రావుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబుపై కౌశిక్‌రెడ్డి దాడికి యత్నించాడని, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను ముందుగా, కౌశిక్‌రెడ్డి చేయి పెట్టి నెట్టేసిన వీడియోను ప్లే చేసి చూపించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబును పట్టుకుని బెదిరించాడని ప్రెస్‌మీట్‌లో కౌశిక్‌రెడ్డి ఆరోపించడం సరి కాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుండటి శ్రీనివాస్ రెడ్డి, వాడే వెంకట్‌రెడ్డి, శ్రవణ్ నాయక్, కోరివి అరుణ్ కుమార్, తాజుద్దీన్, అర్ష మల్లేశం పాల్గొన్నారు.

'మార్చిలోగా స్మార్ట్ సిటీ పనులు పూర్తి'



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌లో చేపట్టిన అభివృద్ధి పనులన్నింటిని మార్చి నెలాఖరులోగా పూర్తయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టామని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. గురువారం స్థానిక 13వ డివిజన్‌లో కార్పొరేటర్ చొప్పరి జయశ్రీవేణుతో కలిసి వెంకటేశ్వరకాలనీ, శ్రీరామ కాలనీల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. అనంతరం వేంకటేశ్వరకాలనీ రోడ్డు నెంబర్ 21లో మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులు 35.75 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించి, నాణ్యతా ప్రమాణాలతో పనులను వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు పనులు దాదాపు తుదిదశకు చేరుకున్నాయని, వాటన్నిటిని కూడా మార్చిలోగా పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్‌సిటీకి 1000 కోట్లు కేటాయించగా అందులో 930 కోట్లతో పనులు చేపట్టామని, వాటిలో 796 కోట్లను కూడా కాంట్రాక్టర్లకు చెల్లించడం కూడా జరిగిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల మరో 30కోట్లను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించిందని, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద 30 కోట్లు కలిపి 60 కోట్లు విడుదల చేయాల్సి ఉందని అన్నారు. ఈనెల 24న మల్టీపర్పస్, జ్యోతిబాపూలే పార్కులు, హౌజింగ్‌బోర్డుకాలనీలో 24/7 వాటర్ సప్లయి, అంబేద్కర్ స్టేడియంలో స్పోర్ట్స్ కమర్షియల్ కాంప్లెక్సు ఈక్లాస్ రూమ్స్ తదితర పనులను కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేతో కలిసి ప్రారంభించడం జరుగుతుందని చెప్పారు. నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులతో సుందరనగరంగా రూపుదిద్దుకుందని పాలకవర్గం పక్షాన సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో డీఈ ఓంప్రకాశ్, ఏఈ గట్టుస్వామి, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు పుస్తకాలు అందజేత

కరీంనగర్ కల్చరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సినీ విమర్శకుడు, సీనియర్ జర్నలిస్ట్, రచయిత పొన్నం రవిచంద్ర తాను రాసిన, తన సంపాదకత్వంలో వెలువడిన పుస్తకాలను గురువారం కలెక్టర్ పమేలా సత్పతికి ఆమె కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో మాడిశెట్టి గోపాల్, వేంకటరమణ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

గణేశ్‌నగర్, జనవరి16 (ఆంధ్రజ్యోతి): టీజీఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో డివిజనల్ ఇంజనీర్ టెక్నికల్ అండ్ సేఫ్టీ అధికారిగా కంచన పల్లి ఉపేందర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. వరంగల్ కార్పొరేట్ ఆఫీసు నుంచి బదిలీపై వచ్చి కరీంనగర్ డీఈ టెక్నికల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఎస్‌ఈ మేక రమేష్ బాబును ఆయన మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

సర్వేను పరిశీలించిన ఆర్డీవో

కరీంనగర్ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో ప్రారంభమైన రైతు భరోసా సర్వేను గురువారం ఆర్డీవో మహేశ్వర్ పరిశీలించారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా చేస్తున్న సర్వేను నేరుగా పరిశీలించి వివరాలను సేకరించారు. ఈనెల 21న గ్రామ సభలు నిర్వహించి 22,23వ తేదిన ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి మంజూరు కోసం పంపించడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

మాజీ కార్పొరేటర్ రవీందర్ మృతి విచారకరం

కరీంనగర్ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మాజీ కార్పొరేటర్ లంక రవీందర్ గుండెపోటుతో అకాల మరణం చెందడం విచారకరమని, ఆయన మృతి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. గురువారం ఈయన మేయర్ యాదగిరి సునీల్‌రావు, డివిజన్ కార్పొరేటర్ భర్త మేచినేని అశోక్‌రావుతో కలిసి లంక రవీందర్ నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీందర్ కుటుంబసభ్యులను పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

రైతు భరోసా సర్వే ప్రారంభం

(5వ పేజీ తరువాయి)

త్వరలో గ్రామాల్లో జరుగనున్న గ్రామసభలు, మున్సిపాలిటీలలో వార్డు సభల్లో లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేస్తారు.

● రేషన్‌కార్డుల దరఖాస్తుల సర్వే

రైతుభరోసా సర్వే బృందాలు గ్రామాలకు వెళ్లిన సమయంలోనే రెవెన్యూ అధికారులు రేషన్‌కార్డుల దరఖాస్తులను కూడా పరిశీలిస్తున్నారు. మున్సిపాలిటీల్లో మున్సిపల్, రెవెన్యూ అధికారులు గత ప్రజాపాలనలో రేషన్‌కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలన చేపడుతున్నారు.

కేటీఆర్‌ను జైలుకు పంపేందుకు కుట్ర

-చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కరీంనగర్ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీల అమలు ఏమైందని ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్‌ను జైలుకు పంపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. ఫార్ములా ఈ రేస్ కేసు నుంచి కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గురువారం సుంకె రవిశంకర్ కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కార్ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌ని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఏ పార్టీ అని అడిగినందుకు కేసులు పెట్టారని విమర్శించారు. చొప్పదండి ఎమ్మెల్యే సత్యం స్థాయికి మించి మాట్లాడుతున్నాడన్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావును విమర్శించే స్థాయి ఆయనకు లేదన్నారు. మరోసారి విమర్శిస్తే బీఆర్ఎస్ నాయకులు తరిమి కొడతారని హెచ్చరించారు. ఈనెల 20లోపు నారాయణపూర్ రిజర్వాయర్‌నీటి విడుదల చేయని పక్షంలో రైతులు, ప్రజలతో గంగాధరలో భారీ ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు నవీన్‌రావు, సాంబయ్య, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు సంఘీభావం తెలిపిన సింగిల్‌విండో చైర్మన్



కేటీఆర్‌తో వీర్ల వెంకటేశ్వర్‌రావు

కరీంనగర్ క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈడీ విచారణ అనంతరం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు(కేటీఆర్)ను రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు సంఘీభావం తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో కేటీ ఆర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

'అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు'

కరీంనగర్ అర్బన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ అన్నారు. గురువారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. గడిచిన ఏడాది కాలంలోనే చొప్పదండి అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మేడిపల్లి సత్యంను చూసి ఓర్వలేక రవిశంకర్ ఆరోపణలు చేస్తున్నాడన్నారు. గతంలో మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు సుంకె రవి శంకర్ డబ్బులు వసూలు చేశాడని ఆరోపించారు. కొండగట్టులో 100 గదుల ధర్మ సత్రం కోసం తిరుమల తిరుపతి దేవస్థానంతో మాట్లాడి కొండగట్టును అభివృద్ధి చేస్తుంటే కనిపించటం లేదా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు పురం రాజేశం, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రామిడి రాజిరెడ్డి, నాయకులు రాచమల్ల రవి, గుర్రం నర్సా గౌడ్, పురం రవి తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి డప్పులతో భారీ ర్యాలీ

జమ్మికుంట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించనున్న వెయ్యి గొంతులు, లక్ష డప్పుల మహాకళా ప్రదర్శన విజయవంతం చేయాలని గురువారం రాత్రి పట్టణంలో కళాకారులు వెయ్యి డప్పులతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి రామంచ భరత్, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, కళా మండలి జిల్లా అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌తో పాటు కళాకారులు పాల్గొన్నారు.

19న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

హుజూరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హైస్కూల్ మైదానంలో ఆదివారం జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు అమిత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 ఏళ్ల లోపు వారు పాల్గొనాలని కోరారు.

మున్నూరుకాపు సంఘం గ్రామ కార్యవర్గం

గన్నేరువరం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మున్నూరుకాపు యువజన సంఘం గ్రామ కార్యవర్గాన్ని ఆ సంఘం మండల అధ్యక్షుడు బొడ్డు సునీల్ ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంగరావు అరుణ్‌సాయి, ప్రధాన కార్యదర్శిగా మంగరావు సాయికుమార్, ఉపాధ్యక్షులుగా పుల్లెల వెంకటేష్, బొడ్డు మహేష్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా బొమ్మ శ్రీనివాస్, కార్యదర్శిగా కొలుపుల అనిల్, సహాయకార్యదర్శులుగా దొగ్గలి రాజు, పుల్లెల సాయితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

'అభివృద్ధిపై మాట్లాడే అర్హత లేదు'

గంగాధర, జనవరి 16(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిపై మాట్లాడే అర్హత మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌కు లేదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గంగాధరలో రామడుగు, గంగాధర మండలాల కాంగ్రెస్ నాయకులు గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో రామడుగు మాజీ ఎంపీపీ జవ్వాజీ హరీష్, గంగాధర బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బుచ్చయ్య, నర్సింగ్ బాబు, వినోద్, మనోహర్, లక్ష్మణ్‌బాబు, శ్రీనివాస్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

రామడుగు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదిర గ్రామంలో రూ. 10 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు గురువారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరీష్, మాజీ సర్పంచ్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం



తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

శంకరపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండల అధికారుల తీరుపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం కేశవపట్నం రైతు వేదికలో గురువారం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే రైతు వేదిక వద్దకు చేరుకుని పరిశీలించగా అక్కడ దుమ్ము పేరుకుపోయి ఉంది. దీంతో ఎమ్మెల్యే తహసీ ల్దార్ భాస్కర్‌పై మండిపడ్డారు. చెక్కులు ఇవ్వను అని చెప్పి వెళ్లి కారులో కూర్చున్నారు. కాంగ్రెస్ నాయకులు కారు వద్దకు వెళ్లి ఎమ్మెల్యేను బుజ్జగించారు. కొంత సమయం తర్వాత కారు దిగి ఏవో ఎక్కడ అంటూ రైతు వేదికలో చెక్కులు పంపిణీ చేసే టేబుల్ వద్దకు చేరుకున్నారు. ఆఫీస్ ఇలానే ఉంటుందా.. చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉందని తెలిసి కూడా శుభ్రం చేసుకోరా అని ప్రశ్నించారు. ఇక్కడ ఉన్న టేబుల్‌తో పాటు కుర్చీలపై ఎంత దుమ్ము పేరుకుపోయిందోనని తహసీల్దార్ భాస్కర్, ఏవో వెంకటేష్‌కు చూపించారు. రైతు వేదికలో ప్రతి రోజూ శుభ్రత పాటించాలని సూచించారు. ఉన్నచోట నుంచి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలి

శంకరపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆటగాళ్ల క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని కేశవపట్నం ప్రభుత్వ పాఠశాలలో మాజీ ఎంపీటీసీ బొంగోని తిరుపతిగౌడ్ తండ్రి స్మారకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. అంతకు ముందకు ఎమ్మెల్యే క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

హుజూరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మామిండ్లవాడలో గురువారం ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, తరుచుగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు కార్యక్రమంలో డిప్యూటీ డీఎం హెచ్‌వో చందు, వైద్యులు మధుకర్, జరినా, గీత, పంజాల ప్రతాప్, కౌన్సిలర్లు సుశీల, ఉజ్మానూరినా పాల్గొన్నారు.

వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



క్యాబ్ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ వేణు

హుజూరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని హుజూరాబాద్ ఎంవీఐ కంచి వేణు అన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని మోటర్ క్యాబ్ ఓనర్లు, డ్రైవర్లకు రోడ్డు భద్రత మహోత్సవాల్లో భాగంగా గురువారం అవగాహన కల్పించారు. ఎంవీఐ మాట్లాడుతూ పరిమితికి మించి మోటర్ క్యాబ్‌లో ప్రయాణికులను తీసుకెళ్లకూడదని చెప్పారు. డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాని సూచించారు కార్యక్రమంలో కానిస్టేబుల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

గంగాధర, జనవరి 16(ఆంధ్రజ్యోతి): గంగాధరలో గురువారం మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను యువజన కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఈసందర్భంగా యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఎమ్మెల్యే సత్యంపై ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. అనంతరం యువ జనకాంగ్రెస్ నియోజవర్గ అధ్యక్షుడు వోడ్నాల యగ్నేష్ ఆధ్వర్యంలో రవిశంకర్ ఇంటి ముట్టడికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఓడ్నాల వంశీ క్రిష్ణ, అనిల్‌రెడ్డి, మనోజ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

రామడుగు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపణలు చేశారని నిరసిస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు పరశురాం గౌడ్, మామిడి దిలీప్‌కుమార్, వినయ్‌గౌడ్, పవన్‌గౌడ్, బసరవేణి అజయ్, చొప్పదండి అనిల్, బండారి మధు, పంజాల వంశీ, పూరెళ్ల రాహుల్, రాయనర్సు, బోదాసు రాజేష్, అభి, విక్రమ్, బాసవేణి రాహుల్, ముషారఫ్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు 'సహకారం'

» మరో రెండు సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

సైదాపూర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో మరో రెండు సహకార సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. మండలంలో మొత్తం 29 గ్రామాలు ఉన్నాయి. వెన్నంపల్లి వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వెన్నంపల్లి, లస్మన్నపల్లి, ఆరెపల్లి, సోమారం, గెర్రెపల్లి, ఎక్లాస్‌పూర్ గ్రామాలున్నాయి. వెన్కేపల్లి విశాల సహకార పరపతి సంఘం(ఎల్ఎస్‌సీఎస్) పరిధిలో 23 గ్రామాలు ఉన్నాయి. ఈ సంఘం పరిధిలో మరో రెండు కొత్త సంఘాలకు ప్రతిపాదనలు పంపారు. దీంతో బొమ్మకల్, రాములపల్లిలో రెండు కొత్త సహకార సంఘాలు ఏర్పడనున్నాయి. బొమ్మకల్ సంఘం పరిధిలోకి బొమ్మకల్, అమ్మనగుర్తి, గుండ్లపల్లి, రాయికల్, రాయికల్ తండా రానున్నాయి. రాములపల్లి సంఘం పరిధిలోకి రాములపల్లి, నల్లరామయ్యపల్లి, గొడిశాల, గుజ్జులపల్లి, ఎల్లంపల్లి, ఎలబోతారం, రాంచంద్రాపూర్, కురుమపల్లి గ్రామాలు చేరనున్నాయి. వెన్కేపల్లి ఎల్ఎస్‌సీఎస్ సంఘం పరిధిలో వెన్కేపల్లి, సైదాపూర్, దుద్దెనపల్లి, సర్వాయిపేట, పెర్కపల్లి, గొల్లగూడెం, ఆకునూర్, వెంకటేశ్వర్లపల్లి, ఘనపూర్, జాగీర్‌పల్లి గ్రామాలు ఉండనున్నాయి.

● సంక్షిప్తం..

● హుజూరాబాద్: నియోజకవర్గ ప్రజల సమస్యలను ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పట్టించు కోవడం లేదని యువజన కాంగ్రెస్ నాయ కుడు శ్రావణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

- పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో తెలంగాణ సగర సంఘం క్యాలెండర్‌ను ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు దేవునూరి శ్రీనివాస్, కట్ట రాజు, తాటిపల్లి కుమారస్వామి, ప్రసాద్, రాజయ్య, అశోక్, మనుసుకేష్, రవీందర్ పాల్గొన్నారు.

● సైదాపూర్: ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఇంటి వద్ద నిర్వహించిన సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న డప్పు కళాకారులకు ఎలబోతారం మాజీ సర్పంచ్ శిరీష సన్మానం చేశారు. కార్యక్రమంలో మారబోయిన వేణు, రావులవేణు పాల్గొన్నారు.

● వీణవంక: మల్లారెడ్డిపల్లి గ్రామంలో నెహ్రూ యువ కేంద్రం కరీంనగర్-యువ చైతన్య ఫ్రెండ్స్ యూత్ క్లబ్ ఫిజికల్ ఫిట్‌నెస్ డే సందర్భంగా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు కర్రె నాని, గోనెల పెద్దలు, ప్రశాంత్, నరేష్, బాలస్వామి, రాము, అనిల్, సురేష్, పవన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

● జమ్మికుంట రూరల్: బిర్యాని సెంటర్లు, హోటళ్ల యాజమానులు మద్యం తాగేం దుకు అనుమతి ఇవ్వొద్దని పట్టణ సీఐ వ రంగంటి రవికుమార్ అన్నారు. పోలీస్ స్టేషన్లో బిర్యాని సెంటర్లు, హోటళ్ల యాజమానులకు అవగాహన కల్పించారు. రాత్రి 10గంటల వరకు దుకాణాలు మూసివేయాలని హెచ్చరించారు.

● గంగాధర: గంగాధర మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడిగా మొగిలి కాంతయ్య, ప్రధాన కార్యదర్శిగా ఇరుగురాల ప్రశాంత్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్ గురువారం ఉత్తర్వుల జారీ చేశారు. ఈసందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సంఘం బలోపేతంతో పాటు ఉపాధ్యాయుల ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతామని తెలిపారు.

- మండలంలోని మహిళా స్వశక్తి కార్యాలయానికి 50 కుర్చీలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం అందజేశారు. గతంలో కార్యాలయానికి వచ్చినప్పుడు కుర్చీలు అందించాలని మహిళా సంఘ సభ్యులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కోరారు.